క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట బుగ్గలేటిపల్లి గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో మొక్కుబడులు చెల్లించుకుని విందు భోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆంజనేయ స్వామి, సాయిబాబా, అక్కదేవతలు, నవగ్రహాలు, వైద్యనాథీశ్వరుడు, వీరభద్రస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీధి దీపాలు ఏర్పాటు



ఎర్రగుడిపాడులో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో కొన్ని వీధి దీపాలు వెలగక పోవడంతో నివాసితుల ఫిర్యాదు చేశారు. స్పందించిన సర్పంచ్ వెంకటలక్షుమ్మ, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం మొత్తం 22 వీధి దీపాలు ఏర్పాటు చేశారు. సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బ్రహ్మానందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎస్.పాలగిరి గ్రామం వద్ద ఉన్న వాగులో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం పింఛన్ పంపిణీ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి అన్ని పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

కంపచెట్ల తొలగింపు



జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

చెన్నూరు : స్థానిక హిందూ స్మశాన వాటికకు వెళ్లే దారి కంపచెట్లు, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి శనివారం తన సొంత నిధులతో స్మశానం వెళ్లే దారిలో ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు.

మిర్చి ధరలు పతనం



మిరప పండును ఆరబెట్టిన దృశ్యం



మిరప పండును తూకం వేస్తున్న కూలీలు

పెద్దముడియం : మిరప పంటను సాగు చేసిన రైతులకు అరకొరగా వచ్చిన దిగుబడికి ధరలు పతనం కావడంతో అమ్ముకోలేక సతమతమవుతున్నారు.

అసలే వర్షాలు లేక తీవ్ర కరువు ఏర్పడిన పరిస్థితులలో మైలవరం జలాశయం కాల్వల ద్వారా వచ్చే నీటితో ఎన్నో ఆశలతో మిరప పంటను రైతులు సాగు చేశారు. గత సంవత్సరం మిరప పంటను సాగు చేసిన రైతులకు భారీగ లాభాలు రావడంతో ఈ సంవత్సరం మండలంలో దాదాపు 1000 ఎకరాలలో మిరప పంటను సాగు చేశారు. వర్షాలు లేకపోవడంతో పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడి మొదటి కోతలో 5 క్వింటాళ్ల కూడా రాలేదు. గత సంవత్సరం 250 రూపాయలు పలికిన కేజీ ధర ఈ సంవత్సరం రూ.150 దిగువకు పడిపోవడంతో రైతులకు భారీ నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకోలేక తమ పంటను శీతల గోదాములలో నిల్వచేసుకుంటున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

బి.కోడూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణలో ఎవరి ఓటు హక్కును వారు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ (ఎలక్షన్ ఆఫీసర్) ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పెద్దుళ్ళపల్లె గ్రామస్తులతో ఎన్నికలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో లేనిపోని ఆరోపణలు చేసుకుని వాదనలకు దిగి ఎంతో విలువైన జీవితాలను కేసుల మూలంగా నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎన్నికలకు ముందు గ్రామంలోని పెద్దలను బైండోవర్ చేయడం జరుగుతుందని, బైండోవర్ మూలంగా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ముందు జాగ్రత్తగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మాత్రమేనని తెలిపారు. ఎన్నికల రోజు మాత్రమే ఎవరి ఓటును వారు వినియోగించుకుని మిగతా సమయాల్లో ప్రతిఒక్కరు స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. సదస్సులో గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్, బి.కోడూరు ఎస్ఐ కత్తి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

స్థాయి తెలుసుకుని మాట్లాడాలి



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు జశ్వంత్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల టీడీపీ నాయకులు తమ నోటికి వచ్చినట్లు మాట్లాడి పబ్బం గుడుపుకోవాలని చూస్తున్నారని.. వైఎస్ కుటుంబాన్ని విమర్శించే స్థాయి మీకెవరికి లేదని వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం పులివెందులలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పులివెందులలో ఒక్క వార్డులోకూడా గెలవలేని వారు వారి స్థాయిని మరచి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎవరి నోటికి వచ్చినట్లు వారు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధి మన రాష్ట్ర మంతా జరిగిందన్న విషయం మీకు గుర్తుకు లేకపోయినా..రాష్ట్ర ప్రజలకు గుర్తుందన్నారు. మీ నాయకుడి మాదిరి అపద్దపు హామీలు ఇచ్చి ఎగురగొట్టలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన సమయానికి ఇచ్చిన హామీలన్ని నెరవేర్చిన మా నాయకుడి గురించి మాట్లాడే అర్హత మీలో ఎవరికీ లేదన్నారు. పులివెందులలో ఎటుచూసినా అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేక ఏదిపడితే అది మాట్లాడటం పరిపాటి అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటిలో మంచి జరిగి ఉంటేనే నాకు ఓటువేయాలని ధైర్యంగా అడుగుతున్నాడన్నారు. మీనాయకుడు గానీ, మీరుగానీ ధైర్యంగా ఓటు అడగగలరా అని ప్రశ్నించారు. లేనిది ఉన్నట్లుగా చూపించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని మీరు చూస్తున్నారన్నారు. జగనన్న పథకాలనే మీ నాయకుడు పేర్లుమార్చి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని.. మీరు ఎంత మభ్య పెట్టాలని చూసినా ప్రజలు జగనన్న వైపే నడుస్తారన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీలోని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ఓటు అడుగటమే కాకుండా ఓటు వేయిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కోసం పుత్తా పాట్లు

చింతకొమ్మదిన్నె : కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తన ఉనికి కోసం నానా పాట్లు పడుతున్నాడని 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో పుత్తా నరసింహారెడ్డి గ్రామాల్లో పర్యటిస్తూ టీడీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి భారీ చేరికలు అంటూ పచ్చపత్రికల్లో డబ్బాలు కొట్టుకుంటున్నారన్నారు. 17వ డివిజన్ నుంచి ఒక వైఎస్సార్‌సీపీ కార్యకర్త కానీ, నాయకులు కానీ టీడీపీ కండువా కప్పుకోలేదన్నారు. మొదట నియోజకవర్గంలో పుత్తాకే షూరిటీ లేదు.. గ్యారెంటీ లేదు ఆయన ప్రజలకు ఏంటి గ్యారెంటీ ఇచ్చేది అని ప్రశ్నించారు. 17వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ క్యాడర్ బలంగా ఉండటంతో తప్పుడు ప్రకటనలు, తప్పుడు ప్రచారాలు టీడీపీ నాయకులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, మట్లి శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

వేంపల్లె : మండలంలో ఉన్న చింతలమడుగుపల్లె సచివాలయంలోని ఫకీర్‌పల్లె గ్రామానికి చెందిన సయ్యద్ షామీర్‌బాను అనే వికలాంగురాలు కడప రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ దౌలత్‌బాషా ఆదివారం కడపకు వెళ్లి ఆమెకు పింఛన్‌ను అందజేశాడు. ఎంపీటీసీ రహమతుల్లా ఖాన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని వలంటర్ బాషాను అభినందించాడు.

అయోధ్య.. అక్షింతలు అందజేత

ప్రొద్దుటూరు : స్థానిక వినాయకనగర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, రామసేవకులు ఆదివారం ఇంటింటికీ తిరిగి అయోధ్య శ్రీరాముని అక్షింతలు, అయోధ్య శ్రీరామ మందిరం చిత్రపటం అందించారు. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్‌ను రూ.3 వేలు వరకు పెంచడంతో అవ్వతాతల ముఖాలలో ఆనందం కనపడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిలంకూరు గ్రామంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ పింఛన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు కేవలం ప్రతి నెల రూ.1000లు మాత్రమే ఇచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.3000 వరకు పింఛన్ పెంచారన్నారు. మండల పరిధిలో అర్హత కలిగిన లబ్ధిదారులకు నూతన పింఛన్‌లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, గ్రామ సర్పంచ్ ఎం.లక్ష్మిదేవి, ఎంపీటీసీ ఎం.కొండయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయాలతో ముందుకు వెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న తొగటవీర క్షత్రియ అధ్యక్షుడు పల్లా శేషయ్య

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : విద్యార్థులు ఉన్నత ఆశయాల కోసం నిరంతరం శ్రమిస్తూ ముందుకు వెళ్లాలని తొగటవీర క్షత్రియుల గురువు శ్రీ దివ్య జ్ఞాన నందగిరి స్వామిజీ తెలిపారు. ఆదివారం మైలవరం మండలంలోని శ్రీ సీతారామ కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వృత్తి విద్యా కోర్సుల్లో 85 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.15 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేసి మాట్లాడారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలని ఆయన విద్యార్థులకు సూచించారు. చదువుకు పేదరికం అడ్డురాదని ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. అనంతరం అహోబిల క్షేత్ర తొగటవీర క్షత్రియ అన్నదాన కమిటీ అధ్యక్షుడు పల్లా శేషయ్య మాట్లాడుతూ నేటి విద్యార్థులుగా ఉన్న మీరు భవిష్యత్తులో జాతి నిర్మాతలుగా తయారు కావాలన్నారు. తద్వారా భవిష్యత్తు తరానికి ఉపయోగపడాలన్నారు. అనంతరం రాయలసీమ స్థాయిలో 100 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు ఒక్కొక్కరికి రూ. 15వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు అలిశెట్టి కుమార్, నారే రాము, సర్పంచ్ జొల్లు కొండయ్య, రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, చౌడేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజికుంట తిరుమల దాసు, ధనుంజయ, పల్లా నాగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మన సంకల్పం వికసిత భారత్



వికసిత్ భారత్ గురించి అవగాహన కల్పిస్తున్న మొబైల్ వ్యాన్

కమలాపురం : మన సంకల్పం వికసిత భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన సంబటూరు, పాచికలపాడు గ్రామాలలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రత్యేక మొబైల్ వాహనంలోని వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ, ఉజ్వల, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, జన్‌ధన్, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాల గురించి వీడియో సందేశం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీతోనే భారత్ అభివృద్ధి సాధ్యం అయిందన్నారు. ప్రపంచంలో ఆర్థికంగా వేగంగా విస్తరిస్తున్న దేశం భారత్ అని ఇది కేవలం మోదీతోనే సాధ్యం అయిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దార్ సరస్వతి, ఏపీఎం అపర్ణ, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ పార్థసారధి, ఈఓఆర్డీ శారదారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను అందరూ అర్థం చేసుకోవాలి

పోరుమామిళ్ల : ధనుర్మాస దీక్షలో భాగంగా ఆదివారం తెల్లవారు జామున గిరినగర్‌కాలనీ రామాలయం నుంచి పట్టణంలోని అమ్మవారిశాల వరకు 400 మంది మహిళలతో నగర సంకీర్తన జరిగింది. అనంతరం అమ్మవారిశాలలో జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో చిన్మయానంద మిషన్ మాతాజీ శ్రేయానంద సరస్వతి మాట్లాడుతూ మహిళల్లో ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేయడం దేశానికి అవసరమన్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కాంక్షించి శ్రీకృష్ణుడు భగవద్గీత బోధించాడని అందరూ భగవద్గీతను అర్థం చేసుకోవాలన్నారు. 500 సంవత్సరాల పోరాట ఫలితంగా అయోధ్యలో రామాలయం నిర్మాణమైందని, శ్రీరాముడు మానవాళికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ రామతత్వాన్ని నింపుకోవాలని శ్రేయానంద సరస్వతి తెలిపారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దోమతెరల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్ రావు జన్మదినం సందర్భంగా ఆయన మనవడు అశుతోష్ మౌలి, పవన్ కుమార్ 75 మంది దివ్యాంగులకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా 47 ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు ఆధ్వర్యంలో రామచంద్రప్రకాష్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వర, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరదాయిని.. జగజ్జనని



పూల అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవిమఠం

- కనుల పండువగా అమ్మవారి ఆరాధనోత్సవాలు
- మార్మోగిన ఈశ్వరీదేవి నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. 'కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు' అంటూ భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఈశ్వరీదేవి మఠం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన ఆదివారం పూర్వపు మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య సాముల వారి ఆరాధన నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, అభిషేకం, బిల్వదళార్చన, గురుపూజ విధులు చేపట్టారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరీదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ద్వార పూజ, నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రామలు చేపట్టారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. బ్రహ్మంగారిమఠానికి చెందిన శ్రీచిన్మయామిషన్ వారి గీతాపారాయణం భక్తులను అలరించింది. సోమిరెడ్డిపల్లె గ్రామం శ్రీ సీతారామభజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జగన్మాత శ్రీఈశ్వరీదేవిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, వొమ్మిన చిన్న ఈశ్వరయ్యశ్రేష్ఠి, మారంరెడ్డి రామనారాయణరెడ్డి, కడారు విశ్వనాథాచార్యులు, అంకిరెడ్డిపల్లె ఓబుల్‌రెడ్డి, తమిదల కోటిరెడ్డి, నొస్సం సుబ్రహ్మణ్యాచారి, పోలు పోలేటమ్మగారి సుబ్బారెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, యాకశిరి జయలక్షుమ్మ, కల్లూరి కేశవాచారి, మహేశ్వరాచారి, నాగరత్నామాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళ

బ్రహ్మంగారిమఠంలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులతో కళకళలాడుతున్నాయి. అమ్మవారి ఆరాధనోత్సవాలకు వచ్చిన వారు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను దర్శించుకుంటున్నారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి వారి నివాస గృహం, పోలేరమ్మ చేత నిప్పు తెప్పించిన రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్య మఠం, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, సిద్ధయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం(విభూది లింగం), మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, రామాలయం (భజన మందిరం) తదితర ప్రాంతాలను సందర్శించారు.



విద్యుత్ దీప కాంతులీనుతున్న దేవస్థానం



గీతాపారాయణం ఆలపిస్తున్న బ్ర.మఠం చిన్మయా మిషన్ వారు

ఉల్లాస భరితంగా ముగ్గుల పోటీలు



పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కడప శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎన్జీఓ కాలనీలో నిర్వహించిన ఈ పోటీలకు స్థానిక మహిళల నుంచి విశేష స్పందన లభించింది. మహిళా మణులు ఒకరినొకరు పోటీలు పడి రంగు రంగుల ముగ్గులు వేసి అందరినీ ఆకర్షించారు. పోటీలో తేజస్విని, రేణుక, గౌరీలు మొదటి, రెండవ, మూడవ బహుమతులు సాధించారు. మరో ముగ్గురికి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా చిట్టెం రాజ్యలక్ష్మి, వంకధారి విజయకుమారి, ఆకుల కల్పనలు వ్యవహరించారు.

ఆవోపా ప్రతినిధులు వంకధారి పుల్లయ్య, చిట్టెం రమేష్, కర్నాటి సురేష్, ఆకుల సత్యప్రసాద్, కృష్ణం, శివలు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మహిళా విభాగం అధ్యక్షులు చెప్పెరపు నాగ పుష్పాంజలి, కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ, దరిశా నాగ సునీత, కో ఆర్డినేటర్లు మాధవీలత, ప్రసన్న, శ్రీదేవిలు పోటీదారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోటీలో పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సంక్రాంతి సంబరాలకు విద్యార్థులు సన్నద్ధం





వైవీయూలో సంక్రాంతి సంబరాలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం సంక్రాంతి సంబరాలకు సన్నాహాలు ప్రారంభించింది. విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో వాణిజ్యవిభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు సంప్రదాయ వేడుకలకు సన్నాహాలు ప్రారంభించారు. గ్రామీణ సంప్రదాయాలను, ఆచారాలను తెలియజెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉట్టికొట్టే పోటీలు, గాలిపటాలు, ముగ్గుల పోటీలు, హరిదాసు కీర్తనలకు సంబంధించిన ఏర్పాట్లను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైవీయూ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సంప్రదాయాలు, ఆచారాలను తెలియజేసేలా, సంక్రాంతి సంబరాలు ఉట్టిపడేలా విద్యార్థులు సందడిగా పనులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దూరవిద సంచాలకులు ఆచార్య కె.కృష్ణారెడ్డి, కామర్స్ విభాగం ఆచార్యులు డాక్టర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.